# అమ్మ కోసమే ఇక్కడికొచ్చా



**యూకేలోని నాలుగు ప్రతిష్ఠాత్మక కాలేజీల నుంచీ ఎఫ్ఆర్సీఎస్‌లు పొందిన ప్రపంచంలోని అతికొద్దిమంది వైద్యుల్లో ఆయన ఒకరు. మనదేశంలో రొమ్ము చికిత్సను ఒక విభాగంగా చేయాలన్న సంకల్పంతో బ్రిటన్‌లోని అవకాశాలను కూడా వదులుకుని వచ్చేసిన ఆ వ్యక్తి డాక్టర్ పి.రఘురాం. 'ఉషాలక్ష్మీ బ్రెస్ట్ క్యాన్సర్ ఫౌండేషన్ స్థాపించింది మా అమ్మలాంటి ఎంతోమంది అమ్మలకోసం' అనే రఘురాం తన జీవిత విశేషాలు చెబుతున్నారిలా...**

'నువ్వు ఇండియా వస్తే... ఏం చేయాలో తోచక మళ్లీ ఇంగ్లాండు వెళ్లిపోతావ్' - హెచ్చరించారు నాన్న.

'నువ్వూ నీ భార్యా డాక్టర్లుగా స్థిరపడ్డారు. ఇల్లు కూడా కొంటానంటున్నావ్. ఇప్పుడు భారత్ వెళ్లిపోతానంటావా? నీకేమైంది' - తిట్టారు స్నేహితులూ ప్రొఫెసర్లూ.

అందుకే ఇక్కడ ఉంటే ఏంటి, ఇండియా వెళ్తే ఏంటి... అని నేనూ మా ఆవిడా లెక్కలు వేశాం. తేలిందేంటంటే... ఇండియా వెళ్లడం నిష్ప్రయోజనమని. అందుకే అమ్మా నాన్నలను మాతో లండన్‌లో ఉండిపో మన్నాం. కానీ, అమ్మ ఇష్టపడలేదు. 'నాకు ఇక్కడుంటే ఏమీ తోచదు. ఇండియాలో ఉంటేనే ప్రశాంతంగా ఉంటుంది' అంది.

ఆ మాట నన్ను కదిలించింది. అమ్మకు కావాల్సింది ఇవ్వాలనిపించింది. నా లెక్కలన్నీ పక్కనపెట్టేలా చేసింది. సుమారు పదేళ్లు ఇంగ్లాండులో ఉన్న నేను... ఏమైనాసరే, ఇండియా వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నాను. కానీ, మిగతా డాక్టర్లలా కాకుండా వినూత్నంగా ఏం చేయాలా అని ఆలోచించాను. అదేదో ఒకట్రెండు రోజులు కాదు... సుమారు నాలుగేళ్లు! పక్కా ప్రణాళిక సిద్ధం చేశాను.

★ ★ ★

మా అమ్మ పేరు ఉషాలక్ష్మి... గైనకాలజిస్ట్. నాన్న చలపతిరావు... జనరల్ సర్జన్. వాళ్లకు నేనొక్కణ్ణే సంతానం. అందుకే గారాబంగా పెరిగాను. నాన్నగారు హైదరాబాద్‌లోని గాంధీ, ఉస్మానియా ఆసుపత్రుల్లోనూ; అమ్మ... నిలోఫర్, సుల్తాన్‌బజార్(హైదరాబాద్) ఆసుపత్రుల్లోనూ పనిచేశారు. చిన్నప్పట్నుంచీ వాళ్లను చూడటం వల్లనేమో... నేనూ డాక్టర్ని కావాలన్న కోరిక ఏర్పడిపోయింది. తనకు ఎన్నిపనులున్నా... నేను భోంచేసేటప్పుడూ, సాయంకాలం చదువుకునేటప్పుడూ అమ్మ నాపక్కనే ఉండేది.

నేను చిన్నప్పట్నుంచీ యావరేజ్ విద్యార్థిని. ఇంటర్‌లో(బైపీసీ) మాత్రం టాప్ త్రీలో ఉండే వాణ్ణి. తరవాత విజయవాడ సిద్ధార్థ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు వచ్చింది. ఉస్మానియా ఆసుపత్రిలో ఏడాదిపాటు హౌస్‌మన్‌షిప్ చేసి, మరో ఆరునెలలు సీనియర్‌హౌస్ జాబ్ చేశాను. తరవాత మంగళూరు(కర్ణాటక)లోని కస్తూర్బా మెడికల్ కాలేజీలో ఎమ్మెస్ (జనరల్ సర్జన్) సీటు వచ్చింది.

## మొదటి టర్నింగ్ పాయింట్

పీజీ చదువు నా జీవితంలో మొదటి టర్నింగ్‌పాయింట్. అప్పటివరకూ నేను యావరేజ్ విద్యార్థినే తప్ప పట్టుదల, లక్ష్యంతో చదవలేదు. ఉస్మానియాలో సీనియర్‌హౌస్ జాబ్ చేయడం వల్ల మంగళూరు కాలేజీలో ఒక క్రెడిట్ ఇచ్చారు. నేను 1992 జూన్ బ్యాచ్‌లో చేరాల్సి ఉన్నా ఆ క్రెడిట్ వల్ల 1993 జనవరి సీనియర్ల బ్యాచిలో చేర్చుకున్నారు. అదే సమయానికి నాన్నగారు 'అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా(ఏఎస్ఐ)' అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అది ఏర్పడి 73 ఏళ్లయితే మనరాష్ట్రం నుంచి అధ్యక్షుడిగా ఎన్నికయింది నాన్నగారొక్కరే. దాంతో మా కాలేజీలో అందరూ 'నీకేంటి, మీ నాన్నగారు ఏఎస్ఐ అధ్యక్షులు. ఎలాగైనా పాసయిపోతావు' అనేవాళ్లు. ఆ మాటలు నాలో పట్టుదలను పెంచాయి. కష్టపడి చదివాను. కాలేజీ ఫస్టు వచ్చాను. ఎమ్మెస్ అయ్యాక ఎఫ్ఆర్సీఎస్ చేయాలన్న పట్టుదలతో యూకే వెళ్లాను.

చిన్నప్పట్నుంచీ కుటుంబానికి దూరంగా ఎప్పుడూ ఉండలేదు. నాకు వంట రాదు. కానీ, యూకే వెళ్లేముందు అమ్మ దగ్గర నేర్చుకున్నాను. యూకేలో ఎఫ్ఆర్సీఎస్ చేయడానికి నాలుగు కాలేజీలున్నాయి. అవి లండన్, ఎడిన్‌బరో, గ్లాస్గో, ఐర్లండు. వీటిలో గ్లాస్గోలో ఎఫ్ఆర్సీఎస్ పార్టు1కు మంచి ప్రిపరేషన్ కోర్సు ఉందని అక్కడికి వెళ్లాను.

గ్లాస్గోలో నేనున్నది వైఎమ్‌సీఏలో. అక్కడ మాదకద్రవ్యాలూ మద్యపానం వాడకం, నేరాలు చాలా ఎక్కువ. అందుకే దాన్ని ఇంగ్లాండుకు 'మాదకద్రవ్యాల రాజధాని' అంటారు. వీధుల్లో 'రాత్రి ఏడు తరవాత బయటకు వెళ్లొద్దు' అనే బోర్డులు చూసి మొదట్లో భయం వేసింది. అక్కడ ఉష్ణోగ్రత మైనస్ 19 డిగ్రీలు ఉండేది. నెలకు 150 పౌండ్లకు బెడ్, బ్రేక్‌ఫాస్ట్ ఇచ్చేవారు. అందరికీ కలిపి వంటగది ఉండేది.



1996లో గ్లాస్గో, ఐర్లండు రాయల్ కాలేజీల్లో ఎఫ్ఆర్సీఎస్ పార్టు1 పూర్తిచేశాను. ఐర్లండులో పాసవడం వల్ల అన్ని కాలేజీల్లోనూ (లండన్, ఎడిన్‌బరో, ఐర్లండ్, గ్లాస్గో) ఎఫ్ఆర్సీఎస్ ఫైనల్‌కు హాజరయ్యే అర్హత వచ్చింది.

నేను ఎఫ్ఆర్సీఎస్ ఫైనల్ ప్రిపరేషన్ కోర్సు చదివిన ఊరిపేరు విక్. అది స్కాట్లాండు ఉత్తరాగ్రం. అక్కడా చలి ఎక్కువే. ప్రదీప్‌దత్తా అని కలకత్తా వారు... చాలా దశాబ్దాల కిందటే అక్కడ స్థిరపడ్డారు. నాలుగు ఎఫ్ఆర్సీఎస్‌లూ పాసైన ఆయన సర్జన్‌గా ఉంటూ, ఎఫ్ఆర్సీఎస్ ఫైనల్‌కు కోర్సులు నిర్వహిస్తుండేవారు. అది ప్రపంచ వ్యాప్తంగా సుప్రసిద్ధ కోర్సు. ఆ కోర్సుకు వెయిటింగ్ లిస్టు ఉన్నా నా అభ్యర్థన మేరకు 1996 బ్యాచ్‌లో అవకాశం ఇచ్చారు. అలా స్కాట్లాండు వెళ్లాను. 1997 ఏప్రిల్‌లో గ్లాస్గోలో ఎఫ్ఆర్సీఎస్ పాసయ్యాను. పరీక్షల్లో థియరీ, వైవా, క్లినికల్స్ ఉంటాయి. ఇవన్నీ స్వల్ప వ్యవధిలో చేయాల్సి రావడం వల్ల లండన్‌లో ఫైనల్ చేయలేకపోయాను. 1997 నాటికి మూడు రాయల్ కాలేజీల నుంచీ ఎఫ్ఆర్సీఎస్ పాసైన ఆంధ్రుణ్ణి నేనొక్కణ్నే.

## ఒక్కో మెట్టూ ఎక్కుతూ...

1997 సెప్టెంబరులో నాకు కార్డిఫ్ ఆసుపత్రిలో ఉద్యోగం రావడం, ఎడిన్‌బరోలోని సుప్రసిద్ధ రాయల్ ఇన్ఫార్మరీ ఆఫ్ ఎడిన్‌బరో

ఆసుపత్రిలో శిక్షణ తీసుకోవడం చకచకా జరిగిపోయాయి. యూకేలో ఉన్నప్పుడే వైజయంతి పరిచయమైంది. ఆ పరిచయం ప్రేమగా మారి, పెద్దల అంగీకారంతో పెళ్లిచేసుకున్నాం.

సౌత్‌వేల్స్‌లో టైప్1 హయ్యర్ సర్జికల్ ప్రోగ్రామ్‌లో శిక్షణ తీసుకునే అవకాశం వచ్చింది. అదిచేస్తే యూకేలో కన్సల్టెంట్ అయిపోవచ్చు. ఇది ఆరేళ్ల శిక్షణ. వైజయంతికి కూడా ఇలాంటి టైప్1 ప్రోగ్రామ్‌లో అవకాశం వచ్చింది. తను మొదట గైనకాలజీ, తరవాత సంతాన సాఫల్య రంగాల్లోనూ; నేను రొమ్ము శస్త్రచికిత్సలోనూ శిక్షణ తీసుకున్నాం. ఆంకోప్లాస్టిక్ ఫెలోషిప్ అని ఆంకాలజీ (క్యాన్సర్ అధ్యయనశాస్త్రం), ప్లాస్టిక్ సర్జరీలు కలగలిపి నేర్చుకునే వైద్యపద్ధతి. ఇది ప్రపంచంలో మొట్టమొదట యూకేలోనే ప్రారంభమైంది. దీనికి యూకేలోని 9 ప్రతిష్ఠాత్మక కేంద్రాల్లో డెడికేటెడ్ ఫెలోషిప్ ప్రోగ్రామ్స్ ఉంటాయి. నేను నాటింగ్‌హామ్ బ్రెస్ట్ సెంటర్‌లోనూ, ప్రపంచంలో అత్యంత పురాతనమైన క్యాన్సర్ ఆసుపత్రి లండన్‌లోని రాయల్ మార్స్‌డన్ హాస్పిటల్‌లోనూ శిక్షణ పొందాను.

## రెండో టర్నింగ్‌పాయింట్

'జీవితం ఇంత సాఫీగా వెళ్లిపోతోంటే హైదరాబాద్ ఎందుకు వచ్చారు' అనిపిస్తోంది కదూ. నా చదువూ, ఉద్యోగాల గురించి పూర్తిగా చెప్పేశాక నా జీవితంలో అతి ముఖ్యమైన మలుపు గురించి చెప్పాలి.

2002లో ఓసారి అమ్మానాన్నా నాతో గడపడానికి ఇంగ్లాండు వచ్చారు. హఠాత్తుగా ఒకరోజు అమ్మకు ఒక రొమ్ములో నొప్పి వచ్చింది. నేను పనిచేస్తున్న ఆసుపత్రిలోనే పరీక్షలు చేయించాను. అప్పుడు తెలిసింది... రొమ్ము క్యాన్సర్ ఉందని! నేను తట్టుకోలేక ఏడ్చేస్తే అమ్మ ధైర్యం చెప్పింది. ఇంగ్లాండులోనే అమ్మకు శస్త్రచికిత్స చేయించా. కీమోథెరపీ కోసం కొన్నాళ్లు ఇంగ్లాండులోనే ఉండాలి. కానీ, అమ్మ ఇష్టపడలేదు. ఇండియా వెళ్లిపోతానంది. చాలాఏళ్ల తరవాత మొదటిసారి నేను మనదేశం గురించి ఆలోచించాను. అమ్మను పంపిస్తే ఎలా ఉంటుందా అని ఆరాతీశాను. భారత్‌లో రొమ్ము సంబంధ వ్యాధుల చికిత్స ప్రత్యేక విభాగంగా లేదనీ, కౌన్సిలింగ్ అస్సలు లేదనీ తెలిసింది. అమ్మకోరిక మేరకు అమ్మానాన్నలను హైదరాబాద్ తీసుకొచ్చి, నిమ్స్ ఆసుపత్రిలో కీమోథెరపీ ఇప్పించి నేను ఇంగ్లాండు వెళ్లిపోయాను. అప్పటికి నేనూ వైజయంతీ డాక్టర్లుగా స్థిరపడ్డాం. మా ఇద్దరు అబ్బాయిలు సాయిరాం, కృష్ణసాయి చదువుకుంటున్నారు. కానీ, అమ్మకు క్యాన్సర్ వచ్చిన తరవాత మేం హైదరాబాద్ వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నాం.

## అమ్మ పేరుతో ఫౌండేషన్

నా బాల్యస్నేహితుడు సతీష్‌రెడ్డి అని అప్పటికి రెడ్డీస్ ల్యాబ్స్ చీఫ్ ఆపరేషన్స్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. ఫౌండేషన్ ఏర్పాటు చేస్తే ఎంతోమందికి సాయం చేయొచ్చని తనే చెప్పాడు. ఆ ఫౌండేషన్ ఎలా ఉండాలో, దాని లక్ష్యాలేంటో నేను తయారుచేశాను.

రొమ్ము సంబంధ వ్యాధుల గురించి మహిళల్లో అవగాహన కల్పించి, స్క్రీనింగ్ చేయించుకునేందుకు వాళ్లను సిద్ధం చేయాలి. రొమ్ము క్యాన్సర్ వచ్చిన ప్రముఖ వ్యక్తులతో మాట్లాడించాలి అనుకున్నాను. ఆ హోమ్‌వర్క్ చేశాక అక్కణ్నుంచే... హైదరాబాద్‌లో అమ్మ పేరుమీద 'ఉషాలక్ష్మీ బ్రెస్ట్ క్యాన్సర్ ఫౌండేషన్' రిజిస్టర్ చేయించాను.

అప్పటికి 'కృష్ణా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(కిమ్స్)'లో అమ్మానాన్నలకు భాగస్వామ్యం ఉండటంతో రొమ్ము చికిత్సా కేంద్రం అందులోనే ఏర్పాటుచేస్తే బాగుంటుందని సూచించారు. కేంద్రం ప్లాన్‌ని కిమ్స్ ఆసుపత్రి వాళ్లకు పంపించాను. మామూలు మమోగ్రామ్ (ఖరీదు రూ.10 లక్షలు) బదులు డిజిటల్ మమోగ్రామ్ (రూ. రెండుకోట్లు) తేవాలని కోరాను. ఇది తక్కువ ధార్మికత, తక్కువ నొప్పితో రొమ్ము క్యాన్సర్‌ను కచ్చితంగా గుర్తిస్తుంది. కేంద్రానికి అమ్మ పేరు చేర్చాలని కోరాను. వాళ్లు అన్నింటికీ ఒప్పుకొన్నారు. అలా 'కిమ్స్ ఉషాలక్ష్మి సెంటర్ ఫర్ బ్రెస్ట్ డిసీజెస్' పేరు వచ్చింది.

రొమ్ము చికిత్సాకేంద్రం మూడునెలల్లో ప్రారంభమవుతుందనగా నేను భారత్ రావాలనుకున్నాను. అందుకూ ఓ కారణం ఉంది. రెడ్డీస్ ల్యాబ్స్ వాళ్లతో కలిసి హైదరాబాద్‌లోని అన్ని ఆఫీసుల్లోనూ తిరిగి మహిళా ఉద్యోగులకు రొమ్ము క్యాన్సర్ గురించి అవగాహన కల్పించాలనుకున్నాను. పరీక్షల కోసం ఓ బస్సు తీసుకోవాలనుకున్నాం. పరీక్షలు చేసేందుకు ఒక బృందం కావాలి కాబట్టి... యూకేలోని అతిపెద్ద స్క్రీనింగ్ కేంద్రమైన జార్విస్ బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్ సెంటర్ నుంచి మమోగ్రాఫ్ చేసే ఇద్దరు రేడియోగ్రాఫర్లతో కలిసి 2007 సెప్టెంబరులో నేను హైదరాబాద్ వచ్చాను. అందరిలోనూ చైతన్యం తెచ్చేందుకు 'పింక్ రిబ్బన్ ప్రచారం' ప్రారంభించాం. అంతర్జాతీయ ప్రమాణాలతో 950 మందికి ఉచితంగా మమోగ్రామ్ చేశాం. అందులో ముగ్గురికి క్యాన్సర్ ఉన్నట్లు తేలింది. ఇలాంటి కార్యక్రమం దేశంలోనే మొట్టమొదటిది. ఆ తరవాత డిసెంబరులో 'కిమ్స్ ఉషాలక్ష్మి సెంటర్ ఫర్ బ్రెస్ట్ డిసీజెస్' ప్రారంభమైంది. దేశంలో రొమ్ము సంబంధ వ్యాధుల చికిత్సకోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మొట్టమొదటి కేంద్రం ఇదే. దక్షిణ భారతంలో మొట్టమొదట డిజిటల్ మమోగ్రామ్ తీసుకొచ్చిందీ మేమే.

ఇందులో ఇప్పటివరకూ 1500 మందికి ఉచితంగా స్క్రీనింగ్ చేశాం. గౌతమి, కమల్ హాసన్, యాష్‌చోప్రా భార్య పమేలా చోప్రా, షబానా ఆజ్మీ, మాజీ ప్రపంచసుందరి డయానా హెడెన్, ఇండియాలో అమెరికా మాజీ రాయబారి భార్య జీనీ మల్‌ఫోర్డ్, యూకే హైకమిషనర్ సర్ రిచర్డ్ స్టాగ్ వంటి ప్రముఖులు మా ఫౌండేషన్ నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

## గ్రామీణ మహిళలకూ...

మామూలు మమోగ్రామ్‌తో స్క్రీనింగ్‌కు రూ.1000, డిజిటల్ మమోగ్రామ్‌తో చేస్తే రూ.1900 తీసుకుంటారు. కానీ, గ్రామీణ మహిళలకు ఖర్చులేకుండా, నిపుణులైన కార్యకర్తలతో రొమ్ము పరీక్షలు చేయిస్తే అన్న ఆలోచన వచ్చింది. అలా రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి నెల్లూరు, విజయనగరం జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టు చేపట్టాం. ఇందులో మా ఫౌండేషన్‌లో శిక్షణపొందిన 10 మంది... గ్రామాలకు వెళ్లి 1500 మంది ఏఎన్ఎమ్‌లు, ఆరోగ్య కార్యకర్తలకు శిక్షణ ఇస్తారు. వాళ్లు గ్రామీణుల్లో అవగహన కల్పించి, పరీక్షలు చేస్తారు. ఇది విజయవంతం అయితే రాష్ట్రమంతటా అమలుచేయాలని నా ఉద్దేశం. రొమ్ముకు సంబంధించి ఏ సమస్య వచ్చినా మహిళలంతా నిర్భయంగా ఉండాలన్నదే నా ఆశయం. ★

## నాలుగోదీ వచ్చింది

**నేను ఇండియా రావడానికి పక్కా ప్రణాళిక తయారుచేశాను. 2006లో మా పెద్దబ్బాయి, 2007లో నేను వచ్చాం. 2008లో మా చిన్నబ్బాయి, 2009లో నా భార్య (వైజయంతి) వచ్చారు. తను ప్రస్తుతం కిమ్స్‌లోనే సంతాన సాఫల్య కేంద్రాన్ని నడుపుతోంది.**

**★ 1999 నుంచి 2010 వరకూ... రాయల్ కాలేజ్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఎడిన్‌బరో తరఫున హైదరాబాద్‌లో 10 ఎఫ్ఆర్‌సీఎస్ ఫైనల్ కోర్సులు నిర్వహించాను. యూకేలో 500 పౌండ్లు తీసుకునే ఈ కోర్సును 150 పౌండ్లకే ఇస్తున్నాం. ఇలా సుమారు వెయ్యిమందికి శిక్షణ ఇచ్చాం. నేను లండన్‌లోని రాయల్‌కాలేజీలో ఎఫ్ఆర్‌సీఎస్ ఫైనల్ చేయలేకపోయానన్న లోటు ఉండేది. ఇక్కడ నేను చేస్తున్న కార్యక్రమాలు నచ్చి 'ఆ కాలేజీవాళ్లు ఎలాంటి పరీక్షా లేకుండానే ఎఫ్ఆర్‌సీఎస్ ఇచ్చారు.**

**★ రొమ్ము సంబంధ వ్యాధులకు మనదేశంలో ప్రత్యేక విభాగం ఉండాలనేది నా కోరిక. నా ఆలోచన నచ్చిన కొందరు సర్జన్లతో 'అసోసియేషన్ ఆఫ్ బ్రెస్ట్ సర్జన్స్ ఆఫ్ ఇండియా' ఏర్పాటుచేశాను.**

